## ఆర్టీసీ బస్సులో బంగారం చోరీ

బెల్లంపల్లి, అక్టోబర్ 10 : ఆర్టీసీ బస్సులో ఓ మహిళ బ్యాగులో నుంచి బంగారం గొలుసు, సెల్‌ఫోన్‌ను చోరీ చేసిన సంఘటన బుధవారం రాత్రి బెల్లంపల్లిలో జరిగింది. బాధితురాలు, ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం..రెబ్బెన మండలం గోలేటీ టౌన్‌షిప్‌కు చెందిన అనిత దసరా పండుగకు బట్టలు, బంగారం గొలుసు కొనేందుకు బెల్లంపల్లికి వచ్చింది. రెండు తులాల బంగారు ఆభరణం తీసుకుని మంచిర్యాల నుంచి కాగజ్‌నగర్‌కు వెళ్తున్న ఆర్టీసీ బస్సులో పాతబస్టాండ్ వద్ద ఎక్కింది. అనుమానం వచ్చిన సదరు మహిళా అనుమానంతో తన బట్టల సంచులను పరిశీలించింది. బంగారు గొలుసుతో పాటు ఆమె వినియోగిస్తున్న సెల్‌ఫోన్ కనిపించలేదు. వెంటనే అప్రమత్తమైన ఆమె బస్సును ఆపి చోరీ జరిగిందని పోలీసులకు ఫిర్యాదు చేసింది. హుటాహుటిన వన్‌టౌన్ పోలీసులు కన్నాల ఫ్లై ఓవర్ బ్రిడ్జిపై ఆర్టీసీ బస్సును ఆపి ప్రయాణికులను అందరినీ తనిఖీ చేశారు. ఎవరీ వద్ద కూడా చోరీ గురైన సొత్తు లభించలేదు.

## చైన్‌స్నాచర్ అరెస్ట్

జన్నారం, అక్టోబర్ 10 : మండలంలోని దేవునిగూడలో ఈ నెల 3న చింతకింది లావణ్య మెడలోని 2 తులాల బంగారు పుస్తెల తాడును ఎత్తుకెళ్లి దొంగను అరెస్టు చేసినట్లు ఎస్ఐ రాజవర్ధన్ తెలిపారు. మండలంలోని రేండ్లగూడకు చెందిన బోర్లకుంట రాజేందర్ బైక్‌పై వచ్చి మెడలో బంగారు గొలుసును ఎత్తుకెళ్లినట్లు సాంకేతిక పరిజ్ఞానంతో గుర్తించి చాకచక్యంగా పట్టుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. హెడ్ కానిస్టేబుల్ తుకారాం, కానిస్టేబుల్ సురేశ్‌ను ఎస్ఐ రాజవర్ధన్ అభినందించారు.

## రేషన్ బియ్యం పట్టివేత

కన్నెపల్లి, అక్టోబర్ 10 : కన్నెపల్లి మండలంలోని సుర్జాపూర్‌కు చెందిన ఇందూరి లక్ష్మణ్ దగ్గర కొనుగోలు చేసిన పీడీఎస్ బియ్యాన్ని కాగజ్‌నగర్‌కు చెందిన సయ్యద్ జావీద్ టాటా వాహనంలో తరలిస్తుండగా గురువారం వెంకటాపూర్ గ్రామ శివారులో పోలీసులు పట్టుకున్నారు. 13 క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకొని ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు కన్నెపల్లి ఎస్ఐ గంగారాం తెలిపారు.

## చింతలమానేపల్లిలో..

చింతలమానేపల్లి, అక్టోబర్ 10 : ఆటోలో అక్రమంగా తరలిస్తున్న 3 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని ఎస్ఐ ఇస్లావత్ నరేశ్ పట్టుకున్నారు. బెజ్జూర్ మండలంలోని ముంజంపల్లి, బారెగూడ గ్రామాల నుంచి సిర్పూర్ వైపునకు ఆటోలో అక్రమంగా తరలిస్తుండగా ముందస్తు సమాచారంతో చింతలమానేపల్లి మండల కేంద్రంలో 3 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని అక్రమ రవాణా చేస్తున్న బొడ్డు పద్మ, చెన్నూరి రాముపై కేసు నమోదు చేసి ఆటో సీజ్ చేసినట్లు ఎస్ఐ నరేశ్ తెలిపారు.

## పేకాడుతున్న ఆరుగురి అరెస్ట్

మంచిర్యాల అర్బన్, అక్టోబర్ 10: పేకాడుతున్న ఆరుగురిని అరెస్ట్ చేసినట్లు మంచిర్యాల టాస్క్‌ఫోర్స్ సీఐ రాజ్‌కుమార్ తెలపారు. గురువారం వారు తెలిపిన వివరాల ప్రకారం జిల్లా కేంద్రంలోని కాలేజ్‌రోడ్డులో ఓ ఇంట్లో రహస్యంగా పేకాడుతున్న సత్తయ్య, కిశోర్, ఆంజనేయులు, రాజు, సతీశ్, రమేశ్‌ను అరెస్ట్ చేసినట్లు పేర్కొన్నారు. వారి వద్ద నుంచి రూ.74వేల నగదును స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు.

## రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి

మంచిర్యాల అర్బన్, అక్టోబర్ 10: మంచిర్యాల, పెద్దపేట రైల్వే స్టేషన్ల మధ్యలో రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు మంచిర్యాల జీఆర్‌పీ ఎస్ఐ మహేందర్ తెలిపారు. మృతుడి ఒంటిపైన లైట్ గ్రీన్ ఫుల్ షర్ట్, బ్లాక్ జీన్స్ ధరించి ఉన్నాడని, అతని ప్యాంట్ జేబులో అగ్గిపెట్టపై 8459515209 ఫోన్ నంబర్ రాసివుందని తెలిపారు. కుడి చేతిపై రామేరా అని హిందీలో పచ్చబొట్టు ఉందన్నారు. మృతదేహాన్ని మంచిర్యాల ప్రభుత్వ దవాఖాన మార్చురీకి తరలించినట్లు, వివరాలకు 9701112343, 832512176 నంబర్లకు సంప్రదించాలన్నారు.

## గంజాయి కేసులో ఐదుగురి అరెస్ట్

తాండూర్, అక్టోబర్ 10 : గంజాయి అక్రమంగా రవాణా, విక్రయిస్తున్న ఐదుగురు నిందితులను గురువారం మాదారం పోలీసులు అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేశారు. తాండూర్ సీఐ కే కుమారస్వామి మాదారం పోలీస్ స్టేషన్‌లో వివరాలను వెల్లడించారు. గురువారం ఉదయం మాదారం శివారులో ఈస్‌గాం గ్రామానికి చెందిన వ్యక్తులు గంజాయున్నారని సమాచారం అందడంతో మాదారం ఎస్ఐ సౌజన్య సిబ్బందితో వెళ్లి వారిని పట్టుకున్నారు. వీరి వద్ద నుంచి రూ. 27,500 విలువైన 1100 గ్రాముల గంజాయి, బైక్, నాలుగు సెల్ ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడి వారిలో తాండూర్ గ్రామానికి చెందిన షేక్ హసమ్, బండారి శ్యామ్, తంగళ్లపల్లికి చెందిన గొర్లపల్లి సందీప్‌కుమార్, కాగజ్‌నగర్ మండలం ఈస్‌గాం కు చెందిన విజయ్ హల్దార్, రాజ్ కుమార్ సర్కార్ ఉన్నారు. ఈస్‌గాంకు చెందిన విశాల్ మహారాష్ట్ర నుంచి గంజాయి తెచ్చి సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. వీరిపై కేసు నమోదు చేసినట్లు తాండూర్, మాదారం ఎస్ఐలు డీ కిరణ్‌కుమార్, సౌజన్య, పోలీసులు తెలిపారు.


దండేపల్లి : బతుకమ్మ ఆడుతున్న మహిళలు


లక్సెట్టిపేటలో..


శ్రీరాంపూర్‌లో వేడుకల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు


ఆసిఫాబాద్‌లో..


నెన్నెలలో..


దహెగాంలో..

# బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో..

- వాడవాడనా ఆడి పాడిన ఆడ బిడ్డలు
- ఘనంగా సద్దుల బతుకమ్మ వేడుకలు


మంచిర్యాల : రెడ్డి కాలనీ లో బతుకమ్మ ఆడుతున్న మహిళలు


చెన్నూర్‌లో..

**నమస్తే నెట్‌వర్క్, అక్టోబర్ 10 :** మంచిర్యాల, కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలో గురువారం సద్దుల బతుకమ్మ వేడుకలు కనుల పండువగా జరిగాయి. తీరొక్క పూలు తెచ్చి బతుకమ్మలను అందంగా పేర్చారు. ప్రధాన కూడళ్లు, ఆలయాల వద్ద బతుకమ్మలను తీసుకువచ్చి ఆటా పాటలతో సందడి చేశారు. అనంతరం చెరువులు, కుంటలు, వాగులు, నదీ తీరాల్లో నిమజ్జనం చేశారు. అనంతరం వాయినాలు ఇచ్చి పుచ్చుకున్నారు. ఈ వేడుకల్లో నాయకులు, మాజీ ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. శ్రీరాంపూర్ కోల్‌బెల్ట్ ఏరియాలో కృష్ణాకాలనీలోని శాంతి స్టేడియంలో సింగరేణి యాజమాన్యం ఆధ్వర్యంలో మహా బతుకమ్మ వేడుకలు, ఫ్యామిలీ డే, ఆటా పాటా కార్యక్రమాలు నిర్వహించింది. వేడుకలను జీఎం సంజీవరెడ్డి, సేవా సమితి అధ్యక్షురాలు రాధాకుమరి ప్రారంభించారు. పెద్ద ఎత్తున మహిళలు బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్నారు. సింగరేణి మందమర్రి, బెల్లంపల్లి ఏరియాల్లో కార్మిక కాలనీల్లో వేడుకల్లో జీఎంలు, అధికారులు పాల్గొన్నారు.


హాజీపూర్‌లో ..


తాండూరు: బోయపల్లిలో..


కోటపల్లిలో..


జైపూర్ : ఎస్టీపీపీలో..


శ్రీరాంపూర్ : వేడుకల్లో పాల్గొన్న జీఎం దంపతులు, మహిళలు


రెబ్బెన : గోలేటిలో బతుకమ్మ పోటీల్లో విజేతలకు బహుమతులు అందిస్తున్న బెల్లంపల్లి ఏరియా జీఎం శ్రీనివాస్

## చెన్నూర్ పట్టణాభివృద్ధికి కృషి

చెన్నూర్, అక్టోబర్ 10: చెన్నూర్ పట్టణాభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి అన్నారు. చెన్నూర్ పట్టణంలోని 4వ వార్డులో డీఎంఎఫ్‌టీ నిధులు రూ 62.90 లక్షలతో చేపట్టే పలు అభివృద్ధి పనులకు కలెక్టర్ కుమార్ దీపక్‌తో కలిసి గురువారం శంకుస్థాపన చేశారు. శనిగకుంట చెరువు పేల్చిన ఘటనలో సూత్రధారులను పట్టుకోవాలని పోలీసులకు సూచించారు. ఇసుక మాఫియా, పేకాటను సహించేది లేదన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ అర్చనాగిల్డా, వైస్ చైర్మన్ నవాజొద్దీన్, కౌన్సిలర్లు రేవెల్లి మహేశ్, మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ మీటింగ్‌లా ప్రభుత్వ కార్యక్రమం !

చెన్నూర్, అక్టోబర్ 10: చెన్నూర్‌లో ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి పలు అభివృద్ధి పనులకు గురువారం శంకుస్థాపనలు చేసిన కార్యక్రమం కాంగ్రెస్ పార్టీ మీటింగ్‌లా సాగిందనే ఆరోపణలు వెల్లువెత్తాయి. పలు అభివృద్ధి కార్యక్రమాల శంకుస్థాపన కార్యక్రమంలో ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామితో పాటు, మున్సిపాలిటీ పాలకవర్గ సభ్యులైన చైర్‌పర్సన్ అర్చనాగిల్డా, వైస్ చైర్మన్ నవాజొద్దీన్‌తో పాటు పలువురు కౌన్సిలర్లు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ కుమార్ దీపక్ ముందే ఎలాంటి ప్రొటోకాల్ పాటించ లేదని మున్సిపాలిటీ పాలక వర్గం ఆరోపించింది. శంకుస్థాపన కార్యక్రమంలో మున్సిపాలిటీ పాలకవర్గ సభ్యుల చేత కొబ్బరి కాయలు కొట్టించకుండా కాంగ్రెస్ నాయకులతో కొబ్బరి కాయలు కొట్టించడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నిస్తున్నారు. ప్రస్తుతం శంకుస్థాపన చేసిన పలు అభివృద్ధి పనులకు 2021లో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అప్పటి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బాల్క సుమన్ మంజూరు చేయించిన నిధులేనని వారు పేర్కొన్నారు. బాల్క సుమన్ నిధులు మంజూరు చేయించారనే విషయాన్ని మర్చిపోయారా...? ఇప్పుడు మీరు ఎన్ని నిధులు తెచ్చారు ? అంటూ వారు ఎమ్మెల్యే వివేక్ వెంటస్వామిని ప్రశ్నించారు. ప్రభుత్వ కార్యక్రమైన శంకుస్థాపన కార్యక్రమంలో ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి ప్రజలతో ఎన్నుకోబడిన మున్సిపాలిటీ పాలకవర్గం సభ్యులైన ప్రజా ప్రతినిధులను పక్కన పెట్టి మీ పార్టీ(కాంగ్రెస్) వాళ్లకే పట్టం కట్టడం సరికాదని విమర్శించారు. ఇప్పటికైనా చెన్నూర్ పట్టణాభివృద్ధికి మీరు మంజూరు చేయించిన నిధులు ఎన్ని అనే విషయాన్ని చెప్పగలరా...? అంటూ వారు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామిని ప్రశ్నించారు. ఇక నుంచి ప్రభుత్వ కార్యక్రమాల్లో ఇలా జరిగితే తప్పకుండా అక్కడే మీకు చేదు అనుభవం ఎదురవుతుందని హెచ్చరించారు.

## పోచమ్మ ఆలయ మరమ్మతులకు విరాళం

తాండూర్, అక్టోబర్ 10 : తాండూర్‌లోని బారెవాడ పెద్ద చెరువు కట్ట వద్ద చాందా పోచమ్మ గుడి నిర్మాణ మరమ్మతుల పనులను గురువారం దాతల సహకారంతో ప్రారంభించారు. తాండూర్ గ్రామపంచాయతీ మాజీ కోఆప్షన్ మెంబర్ ఎలుక రాంచందర్ నిర్మాణానికి అవసరమైన రూ. 21 వేల విలువైన సామగ్రిని నిర్వాహకులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో దత్తాత్రేయరావు, ఇడిదినేని లచ్చన్న, మోర్లే బాపు, పెరక బెల్లయ్య, తాండూరి నవీన్, కొల్లూరి మల్లేశ్, బారెవాడ ప్రజలు, తదితరులున్నారు.

## కార్మిక నేత వెంగళ రావు జయంతి

కాసిపేట, అక్టోబర్ 10 : కాసిపేట మండల కేంద్రంలో కార్మిక నేత పూస్కూరి వెంగళరావు 69వ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ముత్యంపల్లిలో వెంగళరావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి జయంతిని నిర్వహించి ఆయన సేవలను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఆడె బాదు, మాజీ ఎంపీటీసీ కొండబత్తుల రాంచందర్, మాజీ ఉప సర్పంచ్ బోయిని తిరుపతి, బీఆర్ఎస్ కార్యదర్శి మోటూరి వేణు, వర్కింగ్ ప్రెసిడెంట్ రాంటెంకి వాస్‌దేవ్, కాసిపేట గ్రామ అధ్యక్షుడు అగ్గి సత్తయ్య, బీఆర్ఎస్ నాయకులు జాడి రాంచందర్, లంక లక్ష్మణ్, బుగ్గ రాజు, బోయిని సాయికిరణ్, ఉస్కమల్ల గోపాల్, గంగాధారి రాజేశం, మల్లేశ్, పెంటయ్య పాల్గొన్నారు.

## కాంట్రాక్టు ప్రాతిపదికన పోస్టుల భర్తీ

మంచిర్యాల అర్బన్, అక్టోబర్ 10: తెలంగాణ వైద్య విధాన్ పరిషత్, జిల్లా దవాఖానల ప్రధాన అధికారి కార్యాలయ పరిధిలోని దవాఖానల్లో ఒప్పంద సేవల పద్ధతిన పోస్టులు భర్తీ చేయనున్నట్లు జిల్లా ప్రభుత్వ దవాఖానల ప్రధాన కార్యాలయ పర్యవేక్షకుడు కోటేశ్వర్ తెలిపారు. 9 సివిల్ అసిస్టెంట్ సర్జన్ స్పెషలిస్ట్, 1 సివిల్ అసిస్టెంట్ సర్జన్ పోస్టులకు ఒప్పంద సేవల కోసం మార్చి 1వ తేదీ వరకు అవసరం మేరకు నియమిస్తామని, వివరాలకు ఆన్‌లైన్ www.mancherial.telangana.gov.in వెబ్ సైట్లో సంప్రదించాలని తెలిపారు.

## రిటైర్డ్ హోంగార్డ్‌కు సన్మానం

మంచిర్యాల అర్బన్, అక్టోబర్ 10: పోలీస్ శాఖలో 24ఏళ్లు హోంగార్డ్‌గా మంచిర్యాల సబ్ యూనిట్‌లో విధులు నిర్వహించిన ఎం.డీ మన్సూర్ అహ్మద్ గురువారం ఉద్యోగ విరమణ పొందారు. ఈ సందర్భంగా ఆయనను రామగుండం సీపీ శ్రీనివాస్ పూలమాల వేసి, శాలువాతో సన్మానించారు.

## రిపోర్టు చేయాలి

నస్పూర్, అక్టోబర్ 10 : డీఎస్సీలో ఎంపికై ఈ నెల 9న హైదరాబాద్‌లో నియామక ఉత్తర్వులు తీసుకోని వారు ఈ నెల 11న జిల్లా డీఈవో కార్యాలయంలో రిపోర్టు చేయాలని డీఈవో యాదయ్య ప్రకటనలో తెలిపారు.

## గుర్తు తెలియని మృతదేహం గుర్తింపు

మంచిర్యాల అర్బన్, అక్టోబర్ 10: మంచిర్యాల జిల్లా కేంద్రంలోని రైల్వే ఫ్లై ఓవర్ బ్రిడ్జి సమీపంలో ఈ నెల 9న రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నట్లు జీఆర్‌పీ ఎస్ఐ మహేందర్ తెలిపారు. వార్త కథనాల ఆధారంగా మృతుడి కుటుంబ సభ్యులు గుర్తించినట్లు ఎస్ఐ గురువారం తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం స్థానిక పాత మంచిర్యాలకు చెందిన దొడ్డిపట్ల స్వామి (49) ఇస్త్రీ షాపు నడుపుకుంటూ జీవనం సాగించేవాడని, కుటుంబ ఆర్థిక పరిస్థితులు బాగోలేకపోవడంతో మనస్తాపానికి చెంది ఇంటర్ సిటీ ఎక్స్‌ప్రెస్ రైలు కింద పడి ఈ నెల 9న ఆత్మహత్య చేసుకున్నాడన్నారు. మృతుడికి భార్య విజయ, ఇద్దరు కుమారులు సాయినయన్, సంజులు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## యువకుడి ఆత్మహత్య

మందమర్రి, అక్టోబర్ 10: మందమర్రి మున్సిపాలిటీ పరిధిలోని దీపక్ నగర్ కాలనీకి చెందిన ఉదురుకోట నవీన్(33) అనే యువకుడు జీవితం పై విరక్తి చెంది ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్ఐ రాజశేఖర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. డిగ్రీ వరకు చదువుకున్న నవీన్ కొంత కాలం కారు డ్రైవర్‌గా పని చేశాడు. అనంతరం మార్కెట్ ఏరియాలో సొంత వ్యాపారాన్ని ప్రారంభించి అందులో రాణించలేక పోయాడు. తల్లిదండ్రులు వృద్ధులు కావడంతో పాటు ప్రస్తుతం ఎలాంటి జీవనోపాధి లేక ఆర్థిక ఇబ్బందులతో జీవితంపై విరక్తి చెంది గురువారం ఇంటి ఆవరణలోని వెనుక గదిలో పై కప్పుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. నవీన్ తల్లి లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## దసరా ఏర్పాట్ల పరిశీలన

లక్షెట్టిపేట,అక్టోబర్ 10: లక్షెట్టిపేట మున్సిపాలిటీలోని మహాలక్ష్మివాడలో దసరా పండుగ సందర్భంగా జంబి గద్దె వద్ద చేపడుతున్న పనులను మున్సిపల్ చైర్మన్ నలుమాసు కాంతయ్య, అధికారులు గురువారం పరిశీలించారు. ఇటిక్యాల చెరువు వద్ద బతుకమ్మ నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించి, లైటింగ్, చెరువు వద్ద రక్షణ చర్యలపై సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ వెంట తహసీల్దార్ దిలీప్ కుమార్, వైస్ చైర్మన్ పోడేటి శ్రీనివాస్ గౌడ్, మున్సిపల్ కమిషనర్ రాజశేఖర్ తదితరులు ఉన్నారు.

## అసైన్డ్ భూములను ఆక్రమిస్తే చర్యలు


హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేస్తున్న అధికారులు

బెల్లంపల్లి/కాసిపేట, అక్టోబర్ 10 : అసైండ్ భూములను ఆక్రమిస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ జ్యోత్స్న స్పష్టం చేశారు. మండలంలోని ఆకెనపల్లి గ్రామ శివారు నంబర్ 3 పైకి భూమి ప్రభుత్వానికి చెందినదని ఆక్రమిస్తే శిక్షార్హులని హెచ్చరిస్తూ గురువారం రెవెన్యూ సిబ్బంది బోర్డును ఏర్పాటు చేశారు. బెల్లంపల్లి మండలం, పట్టణంలో ప్రభుత్వ స్థలాల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఇక్కడ ఆర్ఐ మురళీధర్‌రావు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## 'సింగరేణి గనులు ప్రైవేట్‌పరం కానివ్వను'

శ్రీరాంపూర్, అక్టోబర్ 10 : సింగరేణి గనులు ప్రైవేటీకరణ కాకుండా అడ్డుకుంటానని మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు పేర్కొన్నారు. గురువారం శ్రీరాంపూర్ ఓసీపీపై జీఎం సంజీవరెడ్డి అధ్యక్షతన ఉజ్వల సింగేరేణి–ఉద్యోగుల పాత్రపై మల్టీ డిపార్ట్‌మెంట్ల కమిటీల ఆధ్వర్యంలో కార్మికులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ముందుగా గనులు, డిపార్ట్‌మెంట్లపై కార్మికులకు సహపంక్తి భోజనాలు ఏర్పాటు చేశారు. గుర్తింపు కార్మిక సంఘం అధ్యక్షుడు వీ సీతారామయ్య, ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు పాల్గొని మాట్లాడారు. ట్రాన్స్‌కో, జెన్ కో నుంచి ప్రభుత్వం ద్వారా బకాయిలు తెప్పించడానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే పేర్కొన్నారు. శ్రీరాంపూర్ ఏరియాకు మరో 40 సంవత్సరాల భవిష్యత్ ఉందన్నారు. సింగరేణి అవార్డుల్లో 11 ఇంటిల్లో 6 అవార్డులు శ్రీరాంపూర్‌కు రావడం సంతోషకరమన్నారు. కోలిండియా రూ.37 వేల కోట్ల లాభాల్లో ఉన్నా కార్మికులకు ఒక్క రూపాయి కూడా ఇవ్వడం లేదన్నారు. ఈ సమావేశంలో ఓసీపీ పీవో శ్రీనివాస్, ఏజెంట్లు గోపాల్‌సింగ్, ఏవీరెడ్డి, మెనేజర్ బ్రహ్మాజీ, ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి ఎస్‌కే బాజీసైదా, డిప్యూటీ ప్రధాన కార్యదర్శి వీరభద్రయ్య, సమ్మయ్య, ఐఎన్‌టీయూసీ ఉపాధ్యక్షుడు జెట్టి శంకర్‌రావు, వెల్ఫేర్ ఆఫీసర్ శంకర్ పాల్గొన్నారు.

**ఎస్ఆర్పీ 1, ఆర్కే 5, ఆర్కే న్యూటెక్, వర్క్‌షాప్‌లలో...**

శ్రీరాంపూర్ ఏరియా ఎస్ఆర్పీ 1, శ్రీరాంపూర్ ఎస్ఆర్పీ 1పై ఏజెంట్ గోపాల్‌సింగ్, మేనేజర్ విజయ్‌కుమార్, ఏఐటీయూసీ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి ముస్కె సమ్మయ్య, కార్యదర్శి కొమురయ్య, ఆర్కే 5గనిపై జీఎం సంజీవరెడ్డి, డీవైజీఎం అబ్దుల్‌ఖాదర్, ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి ఎస్‌కే బాజీసైదా వర్క్‌షాప్ స్టోర్‌లలో డీవైజీఎం రవీందర్, స్టోర్ డీవైజీఎం మల్లయ్య, టింబర్ యార్డు ఇన్‌చార్జి జక్కారెడ్డి, ఆర్కే న్యూటెక్‌పై డీవైజీఎం రాముడు, మేనేజర్ స్వామిరాజు, ఏఐటీయూసీ ఉపాధ్యక్షుడు కొట్టె కిషన్ రావు అవగాహన కల్పించారు.

## సంస్థ మనుగడ ఉద్యోగుల చేతుల్లో..

రెబ్బెన, అక్టోబర్ 10: సింగరేణి సంస్థ మనుగడ ఉద్యోగుల చేతుల్లో ఉందని బెల్లంపల్లి ఏరియా జీఎం ఎం. శ్రీనివాస్ అన్నారు. బెల్లంపల్లి ఏరియా లోని ఖైర్‌గూడ ఓసీపీ లో గురువారం ఉజ్వల సింగరేణి–ఉద్యోగుల పాత్ర కార్యక్రమంలో భాగంగా మల్టీ డిపార్ట్‌మెంట్ కమిటీ అధికారులతో కలిసి ఉద్యోగులకు అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. జీఆర్ఎన్ ప్రతినిధులు కాంట్రాక్టు కార్మికులకు ఒక్కొక్కరికీ రూ.5 వేల చొప్పున 880 మంది కి సంబంధించిన పత్రాలను అందించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ గోలేటి బ్రాంచ్ కార్యదర్శి ఎస్.తిరుపతి, ఏరియా ఎస్‌వోటూ జీఎం రాజమల్లు, పీవో మచ్చగిరి నరేందర్, ఏరియా ఇంజినీర్ భీంరావు జాడే, డీజీఎం(ఐఈడీ) ఉజ్వల్‌కుమార్‌బెహరా, పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి, పీఈ వీరన్న, మేనేజర్ శంకర్, వేల్ఫేర్ అఫీసర్ వేణు లతో పాటు పలువురు ఉన్నారు.

## ప్రజాప్రయోజనాల కోసం మార్కెట్ భవనం కూల్చివేత

మంచిర్యాల అర్బన్, అక్టోబర్ 10: ప్రజాప్రయోజనాల కోసమే నిర్మాణంలో ఉన్న సమీకృత కూరగాయల మార్కెట్ భవనాన్ని కూల్చివేసినట్లు మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేం సాగర్‌రావు అన్నారు. గురువారం ఐబీ స్థలంలో మార్కెట్ కూల్చివేతలను ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ స్థలంలో సూపర్ స్పెషాలిటీ దవాఖాన మాతా, శిశు దవాఖానను నిర్మించనున్నట్లు తెలిపారు. నవంబర్‌లో భవన నిర్మాణ పనులకు ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభిస్తామని ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## కాంట్రాక్ట్ సెక్యూరిటీ సిబ్బందికి అందని లాభాల వాటా

శ్రీరాంపూర్, అక్టోబర్ 10 : శ్రీరాంపూర్ ఏరియాలో పనిచేస్తున్న కాంట్రాక్టు సెక్యూరిటీ సిబ్బంది సంస్థ చెల్లించిన లాభాల వాటా అందలేదు. చెన్నైకు చెందిన ఫస్ట్ మ్యాన్ సెక్యూరిటీ సంస్థ శ్రీరాంపూర్ ఏరియా గనులు, ఓసీపీ, డిపార్ట్‌మెంటుల్లో సెక్యూరిటీ గార్డుల ఏర్పాటుకు కాంట్రాక్టు పొందింది. సింగరేణి సంస్థ కాంట్రాక్టు కార్మికులకు రూ.5000 లాభాల వాటా చెల్లించింది. ఈ మేరకు శ్రీరాంపూర్‌లోని అన్ని డిపార్ట్‌మెంట్ల కాంట్రాక్టు కార్మికులకు లాభాల వాటా అందినప్పటికీ కాంట్రాక్టు సెక్యూరిటీ సిబ్బందికి మాత్రం లాభాల వాటా వారి వేతనాల్లో పడలేదు. దీంతో కార్మికులకు నిరాశే మిగిలింది. తోటి కార్మికులకు ఇతర డిపార్ట్‌మెంటుల్లో లాభాల వాటా అందడం, మాకు అందక పోవడంపై ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై అధికారులను విషయం అడగగా కాంట్రాక్టర్‌కు ఒక్కో కార్మికుడిపై వారికి చెల్లించే రూ.5000 పై జీఎస్‌టీ విధిస్తున్నారని తాను ఎలా భరించాలని నిలిపివేశారని తెలిసింది. ఈ నెల 11న కాంట్రాక్టర్‌తో చర్చించి 195 మంది సెక్యూరిటీ సిబ్బందికి లాభాల వాటా చెల్లించేలా చర్యలు తీసుకుంటామని అధికారులు, ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి బాజీసైదా తెలిపారు.

## పెర్సాపెన్ వద్ద దసరా వేడుకలు

కెరమెరి, అక్టోబర్ 10: మండలంలోని గోండ్ ఝరి గ్రామంలో కుర్సేంగా వంశీయులు పెర్సాపేన్ దసరా వేడుకలను గురువారం నిర్వహించారు. పేన్ పటేల్ కుర్సేంగా మారు ఇంటి నుంచి పూజా సామగ్రితో సంప్రదాయ వాయిద్యాల నడుమ పేన్‌గడ వద్దకు చేరుకున్నారు. విగ్రహాలకు జలాభిషేకం, నైవేద్యాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామపటేల్ కుర్సేంగా బారిక్‌రావ్, కుర్సేంగా వంశ పెద్దలు ధర్మరావ్, దందురావ్, చిత్రు, సూర్యభాన్ పాల్గొన్నారు.

## దుర్గాదేవిగా దర్శనం ఇచ్చిన అమ్మవారు

రెబ్బెన, అక్టోబర్ 10: రెబ్బెన మండలం లోని ఇందిరానగర్ గ్రామంలో కనకదుర్గాదేవి స్వయంభూ మహంకాళి ఆలయంలో అమ్మవారు దుర్గాదేవి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. రెబ్బెన ఎస్ఐ చంద్రశేఖర్ ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకుడు దేవర వినోద్‌స్వామి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించి అన్నదానం ఏర్పాటు చేశారు.

## దసరా వేడుకలకు ఏర్పాట్లు

రెబ్బెన, అక్టోబర్ 10 : రెబ్బెన మండల కేంద్రంలోని రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద దసరా వేడుకలు ఏర్పాట్లను ఉత్సవ కమిటీ సభ్యులతో కలిసి రెబ్బెన ఎస్ఐ చంద్రశేఖర్ పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు మోడెం సుదర్శన్‌గౌడ్, లావుడ్య రమేశ్, అజయ్ జైస్వాల్, దుర్గం దేవాజీ, మోడెం చిరంజీవిగౌడ్, లోకనాయుడు, మడ్డి శ్రీనివాసగౌడ్, దుర్గం రాజేశ్, గోగర్ల రాజేశ్, నర్సింహరాజు, తదితరులున్నారు.

## ఆర్మీ ఉద్యోగుల ఆధ్వర్యంలో ఇన్‌స్పైర్ రన్

దహెగాం, అక్టోబర్ 10 : మండలంలోని పలు గ్రామాలకు చెందిన ఆర్మీ ఉద్యోగుల ఆధ్వర్యంలో గురువారం ఆర్మీ ఇన్‌స్పైర్ రన్‌ను నిర్వహించారు. 1600 మీటర్ల ఈ రన్‌లో పలు గ్రామాలకు చెందిన వారు పాల్గొన్నారు. మొదటి బహుమతి ఎల్కరి రమేశ్(అమర్‌గొండ) రూ.5000, రెండవ బహుమతి సాద్గరి రమేశ్(చేడ్యాయి) రూ. 2000, మూడవ బహుమతి అశోక్(ఇట్యాల) రూ.1000 పొందారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్, రమేశ్, కానిస్టేబుల్ వినోద్ పాల్గొని ఆర్మీ ఉద్యోగులు సమకూర్చిన నగదు బహుమతులను అందజేశారు.

## రావణ దహనాన్ని నిలిపి వేయాలి

బెజ్జూర్, అక్టోబర్ 10 : దసరా పండుగరోజు రావణుడి ప్రతిమను దహనం చేయడం నిలిపివేయాలని ఆదివాసీ నాయకులు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఆదివాసీ భవనంలో మండల ఆదివాసీ నాయకులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రావణ దహనం చేయడం ఆదివాసీల సంప్రదాయానికి విరుద్ధమని ఆదివాసీలు అన్నారు. ఈ కార్యక్రమంలో మండల సర్మిడి కొడప శంకర్, ఆదివాసీ నాయకులు ఉన్నారు.

## ప్రధాన రహదారికి మరమ్మతులు

పెంచికల్ పేట్, అక్టోబర్ 10 :మండల కేంద్రంలోని పెంచికల్ పేట్ –బెజ్జూర్ ప్రధాన రహదారి కొండపల్లి టర్నింగ్ మండల కేంద్రం వరకు మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప ఆధ్వర్యంలో కోనేరు అభిమానులు, కార్యకర్తల సహకారంతో గురువారం సమాధానంతో బీటీ రోడ్డుపై ఏర్పడిన గుంతలను మొరంతో పూడ్చారు. ఈ పనులను జడ్పీ మాజీ చైర్మన్ కోనేరు కృష్ణారావు పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు జాజిమొగ్గ శ్రీనివాస్, సంజీవ్, సుధాకర్, దుర్గం రాజన్న నాయకులు తిరుపతి, బండు, శ్రీనివాస్, వెంకటాచలం, దయాకర్ గౌడ్, రాజేశ్వర్, బాపన్న, సాజిత్, అశోక్, కోనేరు అభిమానులు పాల్గొన్నారు.

## వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఫ్లడ్ లైట్ల ఏర్పాటు

కౌటాల, అక్టోబర్ 10 : కౌటాల మండల కేంద్రంలోని మినీ స్టేడియంలో వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం ఫ్లడ్ లైట్లను ఏర్పాటు చేశారు. స్టేడియంలో రాత్రి, తెల్లవారు జామున సమయంలో లైట్లు లేక చీకటిలో ఇబ్బంది పడుతుండడంతో విరాళాలు జమ చేసి 8 ఫ్లడ్ లైట్లను ఏర్పాటు చేశారు.

## విద్యుత్ స్తంభాన్ని ఢీ కొట్టిన లారీ

సిర్పూర్(టీ), అక్టోబర్ 10 : లారీ ఢీ కొట్టడంతో విద్యుత్ స్తంభం విరిగిన ఘటన మండలంలోని వేంపల్లిలో జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం...కాగజ్‌నగర్ వైపు నుంచి సిర్పూర్(టీ) వైపు వెళ్తున్న లారీ వేగంగా వచ్చి వేంపల్లి గ్రామ సమీపంలోని రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీ కొట్టడంతో విద్యుత్ స్తంభం విరిగింది. ఈ ఘటనలో ఎవరికీ ఏం ప్రమాదం చోటు చేసుకోలేదు. సమాచారం తెలుసుకున్న విద్యుత్ అధికారులు లైన్ ఇన్‌స్పెక్టర్ మల్లేశ్ ఘటన స్థలానికి వెళ్లి మరో స్తంభాన్ని ఏర్పాటు చేసి, విద్యుత్‌ను పునరుద్ధరించారు.

## జాతీయస్థాయి సాఫ్ట్ బేస్ బాల్ పోటీలకు ఎంపిక

బెల్లంపల్లి, అక్టోబర్ 10 : జాతీయ స్థాయి అండర్–19 సాఫ్ట్ బేస్ బాల్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులు గురువారం పట్టణంలోని తిలక్‌స్టేడియం నుంచి తరలివెళ్లారు. ఈ ఏడాది ఆగస్టు 8,9 తేదీలలో బెల్లంపల్లి తిలక్‌స్టేడియంలో రాష్ట్ర స్థాయి ఎంపిక పోటీలు నిర్వహించారు. పోటీల్లో ప్రతిభ చూపిన క్రీడాకారులను జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. సెప్టెంబర్ 7, 8, 9 తేదీల్లో వారికి మూడు రోజుల పాటు తిలక్‌స్టేడియంలో శిక్షణ శిబిరం నిర్వహించారు. ఎంపికైన క్రీడాకారులకు సంబంధించిన కిట్లను సాఫ్ట్ బేస్ బాల్ రాష్ట్ర కార్యదర్శి గురువీందర్, త్రోబాల్ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్, రిటైర్డ్ సీబీ సీఐడీ డీఎస్పీ పులాల రవికుమార్, త్రోబాల్ జిల్లా కార్యదర్శి యాదండ్ల బలరాంలు పంపిణీ చేశారు. ఈనెల 12 నుంచి 14 వరకు హర్యానాలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొననున్నారు.

## ముఖ్యమంత్రిని కలిసిన ఆత్రం సక్కు

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, అక్టోబర్ 10 : ఆసిఫాబాద్ మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు బుధవారం హైదరాబాద్‌లో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఆదివాసీల సమస్యలు పరిష్కరించాలని, జైనూర్‌లో లైంగికదాడి బాధితురాలికి రూ.25 లక్షల ఆర్థిక సహాయం అందించాలని వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు తదితరులు ఉన్నారు.

## ఓటరు జాబితా స్పష్టంగా రూపొందించాలి

నస్పూర్, అక్టోబరు 10 : జిల్లాలో ఎలాంటి అవకతవకలు లేకుండా స్పష్టమైన ఓటరు జాబితా రూపొందించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఓటరు జాబితా స్పష్టంగా తయారు చేయాలని, ప్రీ రివిజన్, రివిజన్ యాక్టివిటీస్ ద్వారా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రీ రివిజన్ యాక్టివిటీస్‌లో భాగంగా ఆగస్టు 20 నుంచి ఈ నెల 18వ తేదీ వరకు ఇంటింటి సర్వే కొనసాగుతుందన్నారు. ఈ నెల 19 నుంచి 28 వరకు 1 నుంచి 8 దరఖాస్తులు పరిశీలించి ముసాయిదా జాబితా రూపొందించాలన్నారు. డిసెంబర్ 24న ఫిర్యాదులు, అభ్యంతరాలను పరిష్కరించి 2025 జనవరి 1న తుది ఓటరు జాబితా ప్రకటిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవోలు రాములు, హరికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## 27న పద్మశాలీ సంఘం ఎన్నికలు

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, అక్టోబర్ 10: ఈ నెల 27న ఆసిఫాబాద్ పట్టణ పద్మశాలీ సంఘం ఎన్నికలను జయప్రదం చేయాలని ఎన్నికల నిర్వహణ సభ్యులు చెన్నూరి ప్రకాశ్, అనుమండ్ల రవీందర్, భోగ మధుకర్ గురువారం ప్రకటనలో తెలిపారు.